మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి జన్మదిన వేడుకలు

రామన్నపేటలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రామన్నపేట, ఏప్రిల్ 20 : నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సుభాశ్ సెంటర్‌లో నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం నార్కట్‌పల్లిలో ఆయన నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, బందెల రాములు, కంభంపాటి శ్రీనివాస్, గొరిగె నర్సింహ, వేమవరపు సుధీర్‌బాబు, బొక్క మాధవరెడ్డి, సాల్వేరు అశోక్, కోళ్ల స్వామి, పోతరాజు సాయికుమార్, జాడ సంతోష్, ఎస్‌కే చాంద్, మిర్యాల మల్లేశం, ఇనాయత్ బేగ్, బాలగోని శివ, చల్లా సత్యప్రకాశ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందుల్లేకుండా చూడాలి

● మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్

ధాన్యం కొనుగోళు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్యాంసుందర్

తుర్కపల్లి, ఏప్రిల్ 20 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి జినుకల శ్యాంసుందర్ అన్నారు. మండలంలోని గంధమల్లలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం వర్షాలకు తడవకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లను క్రమపద్ధతిలో ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ తిరుమల్‌రావు, పీఏసీఎస్ ఈసీ రమేశ్, జనార్దన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

రాజాపేట : జాలలో ఈదురు గాలులకు దెబ్బతిన్న మామిడితోటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రాజాపేట, ఏప్రిల్ 20 : మండలంలోని జాల గ్రామంలో ఈదురు గాలులతోపాటు వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న వరి, మామిడి తోటలను శనివారం మండల వ్యవసాయాధికారి మాధవి పరిశీలించారు. ఈ సందర్భంగా 30 ఎకరాల వరి, 27 ఎకరాల మామిడి తోటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. పంట నష్టం నివేదికను ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు. ఆమె వెంట ఏఈఓ అంజయ్య, రైతులు ఉన్నారు.

జిబ్లక్‌పల్లిలో 20 ఎకరాల్లో నష్టం..

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జిబ్లక్‌పల్లి రెవెన్యూ పరిధిలోని దోతిగూడెం, అంతమ్మగూడెంలో వరి, మామిడి పంట నేలరాలి రైతులకు తీరని నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.

ఐఐటీ ఫౌండేషన్ పరీక్షలో లిటిల్ ఫ్లవర్ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం

మోత్కూరు, ఏప్రిల్ 20 : మోత్కూరు మున్సిపాలిటీలో లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఐఐటీ ఫౌండేషన్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన 180 మంది విద్యార్థులు గత నెలలో నిర్వహించిన పరీక్ష రాయగా, వీరిలో ఆరుగురు గోల్డ్ మెడల్స్, ఐదుగురు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనాథ్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ కొణతం నాగార్జున్‌రెడ్డి ప్రశంసాపత్రాలు అందజేశారు.

చౌటుప్పల్ : మండల కేంద్రంలోని ట్రినిటీ విద్యా సంస్థలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేషన్ డేలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు పాల్గొని విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేశారు. అనంతరం విద్యార్థుల వేషధారణలు, నృత్యాలు అలరించాయి.

కార్యక్రమంలో రిటైర్డ్ కలెక్టర్ లక్ష్మీకాంతం, ట్రినిటీ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల, వైర్మన్ కేవీబీ కృష్ణారావు, కౌన్సిలర్ కాసర్ల మంజుల పాల్గొన్నారు.

ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

● ఏసీపీ రవికిరణ్‌రెడ్డి

ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న పోలీసులు

బీబీనగర్, ఏప్రిల్ 20 : ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఏసీపీ రవికిరణ్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండలంలోని గూడూరులో పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా, ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా వారిలో నమ్మకం, భరోసా, భద్రత కలిగించేందుకు జిల్లా పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐ రమేశ్, సిబ్బంది, కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నారు.

తాను మరణిస్తూ.. మరో ఐదుగురికి ప్రాణదానం

వలిగొండ, ఏప్రిల్20 : తాను మరణిస్తూ తన అవయవాలను దానం చేసి ఐదుగురికి ప్రాణదానం చేసి మానవత్వం చాటుకున్న ఘటన మండలంలోని కంచనపల్లిలో చోటుచేసుకుంది. కంచనపల్లికి చెందిన మెరుగు అంజయ్య(45) అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని కామినేని దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం వైద్యులు ఆయనకు బ్రెయిన్‌డెడ్ అయినట్లు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకొచ్చి కిడ్నీలు, లివర్, కండ్లు, గుండెను దానం చేసి మానవత్వం చాటుకున్నారు.

లక్ష్మీనరసింహుడి నిత్య తిరుకల్యాణం



స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 20 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం వైభవంగా జరిగింది. శనివారం ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవ నిర్వహించారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో నరసింహస్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. సుమారు 11 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.19,58,045 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. అనుబంధ రామలింగేశ్వర స్వామి ఆలయంలో సీతారామచంద్ర వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా సీతారామ హనుమత్ మూలమంత్ర జపాలు, దశశాంతి పంచసూక్త పారాయణాలతో అభిషేకం, ఆధ్యాత్మ రామాయణ పారాయణం, అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించి ఉత్సవాలకు పరిసమాప్తి పలికారు.

గురుకుల హాస్టల్ సరుకుల తరలింపు అడ్డగింత

గురుకుల పాఠశాల నుంచి ఆటోలో తరలిస్తున్న వస్తువులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 20 : భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగి ఓ విద్యార్థి మరణించిన సంఘటనపై పూర్తి విచారణ జరుగకముందే సిబ్బంది హాస్టల్ నుంచి మిగిలిన సరుకులను అక్రమంగా ఆటోలో తరలిస్తుండగా చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ సభ్యులు ఆటోను అడ్డగించారు. ఫుడ్ పాయిజన్‌కు కారణమైన కిరాణా సామగ్రిని ఆటో(టీఎస్ 27 టీ 2170)లో శనివారం మధ్యాహ్నం తరలిస్తుండగా జిల్లా బాలల హక్కుల సంఘం నాయకుడు కొడారి వెంకటేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు బుగ్గ రమేశ్ ఆటోను అడ్డగించారు. ఆటోలోని వస్తువులను తిరిగి హాస్టల్‌లోకి పంపించారు. ఈ సందర్భంగా కొడారి వెంకటేశ్ మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలల కో-ఆర్డినేటర్ రజిని, రెవెన్యూ డివిజన్ అధికారి అమరేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరెడ్డి, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి జైపాల్‌రెడ్డి హాస్టల్ తనిఖీ చేస్తున్న సమయంలోనే హాస్టల్ సిబ్బంది అక్రమంగా కిరాణా సామగ్రిని తరలించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఆటోను ఆపి డ్రైవర్‌ను అడుగుతున్న సమయంలో హాస్టల్ సిబ్బంది ధనుంజయ్ వచ్చి ఆర్డీ అనుమతితోనే పంపిస్తున్నామని చెప్పగా ఆర్డీఓకు ఫోన్ చేయగా తనకు సంబంధం లేదని చెప్పినట్లు వెంకటేశ్ తెలిపారు. గురుకుల పాఠశాల రీజనల్ కో-ఆర్డినేటర్ రజినికి ఫోన్ చేయగా ఆమె స్పందించకపోవడంతో సదరు కిరాణా సామగ్రిని తిరిగి హాస్టల్‌కు పంపించినట్లు చెప్పారు. అక్రమ తరలింపుపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పలు అంగన్‌వాడీల్లో గ్రాడ్యుయేషన్ డే

చౌటుప్పల్ : బంగారిగడ్డ అంగన్‌వాడీలో గాడ్యుయేషన్ డేలో పాల్గొన్న అధికారులు, చిన్నారులు

వలిగొండ, ఏప్రిల్ 20 : మండలంలోని పులిగిల్ల అంగన్‌వాడీ-1లో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనమ్మ పాల్గొని ప్రీ స్కూల్ అసైన్‌మెంట్ యాక్టివిటీస్‌లలో ప్రతిభ చూపిన చిన్నారులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3 ఏండ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలని, చిన్నారుల మానసిక వికాసానికి, శారీరక ఎదుగుదలకు ఉపయోగపడేలా ఆటపాటలతో విద్యను బోధిస్తామన్నారు. అంగన్‌వాడీల సేవలను గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు వినియోగించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ శ్రీలత, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

బీబీనగర్ : మండలంలోని కొండమడుగు అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ ఎడ్యుకేషన్ డేను టీచర్ శోభారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పిల్లల తల్లులు, ఆయా పద్మ, పాల్గొన్నారు.

చౌటుప్పల్ : చౌటుప్పల్‌లోని బంగారిగడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ యశోధ, సీహెచ్‌ఓ చంద్రశేఖర్, సీడీపీఓలు శైలజ, వసంత, ఏసీడీపీఓ సమీర, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పాస్ పుస్తకాలు రద్దు చేయాలని వినతి

డిప్యూటీ తాసీల్దార్ నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు, ప్లాట్ల యజమానులు

భూధాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 20 : దేశ్‌ముఖి గ్రామ పరిధిలోని 1, 9 సర్వే నంబర్లలోని పాస్ పుస్తకాలను రద్దు చేయాలని కోరుతూ ప్లాట్ల యజమానులు, గ్రామస్తులు శనివారం డిప్యూటీ తాసీల్దార్ నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. 2000 సంవత్సరంలో దేశ్‌ముఖిలో 1,9 సర్వే నంబర్లలో 29 ఎకరాల విస్తీర్ణంలో నార్త్ ఈస్ట్ మెడోన్ పేరుతో వెంచర్ ఏర్పాటు చేశారని, అప్పటి నుంచి ప్లాట్ల యజమానులు కబ్జాలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం ధరణి ఏర్పాటు చేసిన తర్వాత కొందరి పేర్లపైన (పోతుల లింగయ్య, పోతుల ముత్యాలు, పోతుల యాదయ్య, పోతుల గంగమ్మ) రిజిస్ట్రేషన్ చేశారు. కాగా, పోతుల లింగయ్యకు 0.17 గుంటల భూమి ఉన్నట్లు పాస్‌బుక్‌ను అక్రమంగా జారీ చేశారని, దాంతో సదరు వ్యక్తికి చెందిన ప్లాట్ కడీలను ఇతరులు ధ్వంసం చేశారని తెలిపారు. విచార ణ లేకుండా పాస్ పుస్తకం జారీ చేసినందున అధికారులపై చర్యలు తీసుకోవాలని, పాస్ పుస్తకాన్ని రద్దుచేసి తమకు న్యాయం చేయాలని ప్లాట్ల యజమానులు కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చిల్లర జంగయ్య, మాజీ సర్పంచ్ దుర్గం స్వప్న, నాయకులు గుండాల రాజారాం, నూకల అశోక్, గ్రామస్తులు. ప్లాట్ల యజమానులు పాల్గొన్నారు. ఈ విషయమై డిప్యూటీ తాసీల్దార్‌ను వివరణ కోరగా.. 2019లో ఒక్కరి పేరునే పాస్ పుస్తకం వచ్చిందని, లింగయ్య పేరున ముగ్గురు వ్యక్తులు ఉన్నారని, ఈ విషయంపై విచారణ చేపడుతామని తెలిపారు.

బీఆర్ఎస్ రోడ్‌షోను విజయవంతం చేయాలి

● ఆ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేశ్

బొమ్మలరామారం, ఏప్రిల్ 20 : లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు మండల కేంద్రంలో నిర్వహించే రోడ్ షోను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు పోలగాని వెంకటేశ్ గౌడ్ గులాబీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, పార్టీ అభ్యర్థి క్యామ మల్లేశ్ హాజరుకానున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కట్ట శ్రీకాంత్‌గౌడ్, బెజ్జెంకి పాపిరెడ్డి, బండి మహేశ్ గౌడ్, జూపల్లి భరత్, పాండు, వెంకటేశ్ పాల్గొన్నారు.

సావిత్రమ్మకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నివాళి

సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 20 : మండలంలోని మహ్మదాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ మల్లేపల్లి సావిత్రమ్మ రెండ్రోజుల క్రితం మృతి చెందింది. విషయం తెలిసిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి శనివారం సావిత్రమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి సావిత్రమ్మ చిత్రపటానికి నివాళి అర్పించారు.

ఆత్మకూరు(ఎం) : మాజీ ఎంపీ మధుయాష్కీ తల్లి అనసూయ ఇటీవల మృతి చెందింది. శనివారం ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ హైదరాబాద్‌లోని మధుయాష్కీ ఇంటికి వెళ్లి అనసూయ చిత్రపటానికి నివాళి అర్పించి సంతాపం తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలి : సీపీఎం

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 20 : లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని సీపీఎం మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రతి పేద కుటుంబానికి 15 లక్షలు అకౌంట్లో వేస్తామని చెప్పి రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టినట్లు గుర్తుచేశారు. రైతాంగానికి తీవ్ర నష్టం చేసేలా తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలను వామపక్షాల పోరాటంతో రద్దు చేసినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు ప్రసాదం విష్ణు, మంచాల మధు పాల్గొన్నారు.

దొంగతనాలపై అవగాహన

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 20 : దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ పోలీస్ సిబ్బంది సూచించారు. శనివారం మండలంలోని వడాయిగూడెంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. వేసవిలో ప్రజలు ఆరుబయట నిద్రించొద్దని, ఇంటి తలుపులు వేసుకోవాలని, విలువైన వస్తువులను జాగ్రత్త పర్చుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ బబ్బూరి శంకర్ గౌడ్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

చల్లబడ్డ వాతావరణం.. ప్రజలకు ఉపశమనం

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 20 : కొన్ని రోజులుగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ తరుణంలో శనివారం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులతో ఆకాశం చల్లబడింది. శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం జిల్లాలోని పలు మండలాల్లో ఈదురుగాలతో కూడిన వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది. శనివారం భువనగిరిలో గరిష్ఠంగా 39.7 డిగ్రీలు, అత్యల్పంగా వలిగొండలో 35.1డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు తెలిపారు.

పాలిటెక్నిక్ లెక్చరర్స్ ఎంట్రెన్స్‌లో వలిగొండవాసికి 5వ ర్యాంక్

మోటె శ్రీనివాస్

వలిగొండ, ఏప్రిల్ 20: టీఎస్‌పీఎస్‌సీ ద్వారా ప్రభుత్వం నిర్వహించిన పాలిటెక్నిక్ లెక్చరర్స్ ఎంట్రెన్స్ పరీక్ష ఫలితాల్లో వలిగొండకు చెందిన మోటె శ్రీనివాస్ రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్ సాధించినట్లు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం ప్రకటించిన ఫలితాల్లో ఎలక్ట్రానిక్స్ విభాగంలో ఈ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. ఆయనకు స్నేహితులు, బంధువులు అభినందనలు తెలిపారు.

ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 20 : మండలంలోని పల్లెర్లకు చెందిన తుంగ యాదగిరి ఇటీవల అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుమారుడైన నరేశ్‌కు తోటి స్నేహితులు శనివారం రూ.11వేల ఆర్థిక సాయం అందజేశారు. శేఖర్, మహేశ్, నగేశ్, పురుషోత్తం పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థపై అవగాహన అవసరం

● జస్టిస్ కందుల రామనర్సయ్య

సమావేశంలో మాట్లాడుతున్న కేఆర్ జస్టిస్ ఫోరం చైర్మన్ జస్టిస్ కందుల రామనర్సయ్య

బీబీనగర్, ఏప్రిల్ 20 : మండలంలోని రాఘవాపురంలో గల గురుకుల సైనిక డిగ్రీ కళాశాలలో కేఆర్ జస్టిస్ ఫోరం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం అనే అంశంపై ఫోరం చైర్మన్ జస్టిస్ కందుల రామనర్సయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్‌ను కాంక్షిస్తూ శాసన, కార్యనిర్వాహణ, న్యాయవ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేలా రాజ్యాంగబద్ధంగా ఎదుగాలని అన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహాం లింకన్ తెలిపినట్టుగా ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలు నిర్మించుకునే ప్రభుత్వాలు ఏర్పడడానికి నిబద్ధత కలిగిన యువత ఓటు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శర్మ, కేఆర్ జస్టిస్ ఫోరం కన్వీనర్ మైలారం సత్యం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ స్రవంతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిద్రిస్తున్న మహిళలను బెదిరించి చోరీ

● 3తులాల బంగారం.. 30తులాల వెండి అపహరణ

వలిగొండలో చోరీ జరిగిన ఇంటివద్ద విచారణ చేస్తున్న జిల్లా అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి

వలిగొండ, ఏప్రిల్ 20 : ఇంటిపై నిద్రిస్తున్న మహిళలను బెదిరించి బంగారం, వెండి, నగదును అపహరించుకెళ్లిన సంఘటన మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. శనివారం పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో నివాసం ఉంటున్న భీముడి మధుసూదన్‌రెడ్డి శుక్రవారం రాత్రి వ్యక్తిగత పనిపై బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో ఇతని ఇంట్లోకి ఇద్దరు గుర్తు తెలియని దుండగులు వెళ్లి ఇంటిపై నిద్రిస్తున్న మధుసూదన్‌రెడ్డి భార్య, తల్లి వద్ద ఉన్న బంగారు నగలు ఇవ్వాలని, లేకుంటే చంపేస్తానని బెదిరించారు. వారి వద్ద బంగారం లేదని నిర్ధారించుకున్నాక ఇద్దరిలో ఒక్కడు మహిళల వద్ద కాపలా ఉండి, రెండో వ్యక్తి ఇంటి తాళాలను పగుల గొట్టి బీరువాను ధ్వంసం చేసి 3 తులాల బంగారు గొలుసు, 30 తులాల వెండి ఆభరణాలు, రూ.4 వేల నగదును దోచుకుని పరారయ్యారు. అనంతరం మహిళలు ఇరుగు పొరుగువారికి సమాచారం ఇచ్చారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులతోపాటు జిల్లా అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, ఫింగర్ ప్రింట్స్ నిపుణులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ మహేందర్ లాల్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొల్లూరులో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఆలేరు రూరల్, ఏప్రిల్ 20 : మండలంలోని కొల్లూరులో 1990-91 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సత్కరించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లారెడ్డి, మల్లేశం, శ్రీనివాసచారి, అంజయ్య, పూర్వ విద్యార్థులు గ్యాదపాక నాగరాజు, కుమారస్వామి, సులోచన, శోభారాణి, జ్యోతి, శివకుమార్, శంకరయ్య, శ్రీరాంరెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.

గురుకుల ఫలితాల్లో పుట్టపాక విద్యార్థుల ప్రతిభ

గురుకులాల్లో సీట్లు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయినులు

సంస్థాన్‌నారాయణపురం, ఏప్రిల్ 20 : రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన టీజీ సెట్ గురుకుల ఎంట్రెన్స్-2024 ఫలితాల్లో మండలంలోని పుట్టపాక ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మొత్తం 38 మంది విద్యార్థులు గురుకుల పరీక్ష రాయగా 23మంది పలు పాఠశాలల్లో సీట్లు సాధించారు. ఎలాంటి కోచింగ్ లేకుండానే పాఠశాల ఉపాధ్యాయుల కృషితోనే విద్యార్థులు సత్తా చాటారు. పుట్టపాక ఎంపీటీసీ మర్రి వసంతానర్సిరెడ్డి పాఠశాలలో విద్యా వలంటీర్‌ను నియమించి తనకు వచ్చే రూ.5 వేల వేతానాన్ని వలంటీర్‌కు అందించి పాఠశాల అభివృద్ధికి తోడ్పడుతున్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ వసంతకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లావణ్య, హేమలత, పద్మావతి, సంతోషకుమారి, సునీత, రజిని పాల్గొన్నారు.

పాడి రైతు కుటుంబానికి బీమా చెక్కు

ఆంజనేయులు కుటుంబ సభ్యులకు బీమా చెక్కు అందజేస్తున్న పాల సేకరణ కేంద్రం నిర్వాహకులు

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 20 : ప్రమాదవశాత్తు ఇటీవల మృతి చెందిన మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పాడి రైతు సుబ్బూరు ఆంజనేయులు కుటుంబ సభ్యులకు రూ.2,02,500 చెక్కును పాల సేకరణ కేంద్రం నిర్వాహకులు శనివారం అందజేశారు. కార్యక్రమంలో హెరిటేజ్ డైరీ జోనల్ హెడ్ సత్యనారాయణ, డెయిరీ రీజినల్ హెడ్ నర్సింగ్‌రావు, హెరిటేజ్ భువనగిరి పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ ఎలిమినేటి కిరణ్, వెటర్నరీ అసిస్టెంట్ బాలరాజు, రామకృష్ణాపురం హెరిటేజ్ పాల సేకరణ కేంద్రం అధికారి చింతల ఆంజనేయులు, పాడి రైతులు పాల్గొన్నారు.